


# ఐదుగురి కథ

## అవసరాల రామకృష్ణారావు

క్రప్పుతో కాఫీ తెచ్చి విసురుగా నా ముందున్న బల్లమీద పెట్టి మా మహాలక్ష్మి నిష్ఠూరాలు ప్రారంభించింది.

"ఎన్నిసార్లు ఉత్తరాలు రాసినా జవాబు రాయవు. ఎవరిచేత కబురంపించినా మాటాడవు. ఆడకూతుర్ని నేనొక్కర్తినీ ఎంతకని చచ్చేది? మీ బావ ఉన్నన్నాళ్ళూ రెండో కంటివాడికి తెలీకుండా యిలాంటి వన్నీ స్వయంగా చూసుకునేవారు. ఆయన బతికున్నన్నాళ్ళూ ఎంత మూర్ఖంగా ప్రవర్తించానో ఇప్పుడు తెలుసుకొస్తోంది. ఏం చెయ్యను! ఇవ్వుడు చిన్న చిన్న విషయాలకు కూడా మీకాళ్లూ మీకాళ్లూ పట్టుకోవలసి వస్తోంది – ఇంతకీ నా ఖర్మలే!"

ఖర్మే! ఖర్మ కాక మరేమిటి? చేసిన వన్నీ చేసెయ్యడం అన్నిటికన్నా పెద్దఖర్మ! పని మీద నన్ను పిలిపించి, నావల్ల ఉపకారం జరగవలసి ఉండి, నన్ను దుమ్మెత్తి పొయ్యడం, డికాక్షన్ ఎక్కువయిన కాఫీతోసహా వాటిని భరించవలసిరావడం అన్నీ ఖర్మే! అందుకనే నేను సాధారణంగా అక్కడికి కదిలిరాను. కాని 'కార్పణ్య దోషాపహత స్వభావుణ్ణి' అవడంచేత పోనీ దిక్కులేనిది కదా అని జాలిపడి నాలిక కరచుకుంటూ ఉంటాను.

మహాలక్ష్మి మా పెత్తల్లి కూతురు. ఆవిడ అదృష్టమా అని మా బావ బతికుండగా ఆడపిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు చేసేశాడు. ఇక మిగిలింది మొగపిల్లాడు సోమనాథంగాడు. వాడు ఛార్టెడు ఎకౌంటెంటు పరీక్ష ప్యాసై బొంబాయిలో ఏదో ప్రైవేటు కంపెనీలో నిక్షేపంలా పనిచేస్తూ ఆరొందలు తెచ్చుకుంటున్నాడు.

"నేనూ, మా పిల్లలూ కాక మా ముసిలి అత్తగారూ, మా వెధవాడపడుచూ ఉండేవారు. ఇందర్నీ ఆయన నూటయాభైతో పోషించేవారు. ఈ సోముగాడు ఒక్కడూ ఆ ఆరొందలూ ఏం చేస్తున్నాడంటావ్ రామం?"

"నేను జవాబు చెప్పలేదు. అర్థంలేని ఆ ప్రశ్నకు ఆశ్చర్యపడలేదు కూడా. ఈ లోకంలోని మనుషులకి డబ్బున్నవాళ్ల

కంటె కంటక ప్రాయులు మరెవరూ లేరు. మన బంధువులకిగాని, చాలవరకు స్నేహితులకి గాని మనకి ఎంత డబ్బు వస్తోందో ఎలా ఖర్చు పెడుతున్నామో అన్నది తప్ప మన గురించి మరేమీ అక్కర్లేదు. న న్నీ మధ్య ఎవరో అడిగారు "అన్నీ కలిపి నీకు నెలకి నాలుగొందలు కిడుతుంది కదా, ఎన్నాళ్ళయినా మీరు ముగ్గురే కదా, అంత సొమ్మూ ఏం చేస్తారు?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఎంత ఖర్చు అవుతూందో, ఎంత మిగులుతోందో ఏమీ తెలీడం లేదు. మీకుచూస్తే చేతినిండా పని ఉన్నట్టు కనబడదు. మరోలా అనుకోకపోతే కాస్త నాకు జమా, ఖర్చూ వేసి పెట్టి ఆ సంగతి మీరే తేల్చుకోరాదూ, నాకు ఉపకారం చేసినట్టు అవుతుందీ!"

నేరకపోయి యీ మాట అన్నాను. ఆ తరవాత అతనికీ నాకూ మాటల్లేవు. అలాంటి వాళ్ళతో మాటలు లేనందుకు నాకు విచారమూ లేదు.

"నరుని కంట నల్లరాయే బద్దలైతే, నారి కంట నాలుగురాళ్ళు తెచ్చుకున్న వాళ్ళందరూ బద్దులౌతారు. ఆ పైన ఎర్రగా బుర్రగా ఉన్నాదేమో ఎత్తుమడమల దొరసాను లందరూ ఎగరేసుకుపోతారు. "మన సోముగాడు ఆ మహాపట్నంలో తిన్నగా ఉంటా డంటావా రామం?"

"ఎందు కక్కయ్యా, లేనిపోనివి తల్చుకు బాధపడతావ్? వాడి నీతి వాడి కుండాలిగాని ఎక్క డుంటే మాత్రం ఏముంది? గుట్టు చప్పుడుగా రోజు కో కన్నెచెర విడిపించే పుట్టు ఛాందసులు ఏ పల్లెటూళ్ళో మాత్రం లేరు? ఇప్పుడు మనం ఉన్న పట్నం మాత్రం ఏం తీసిపోయిందనీ? సారా దొరకని వసారా, ఆడది దొరకని విడిదీ ఉందా అని?"

"అందుకనే నీతో ఏం మాటడకూడదు- ఆడాళ్ళతో అయినా సరే ఏంతోస్తే అది అనేస్తావు. ఈ కబుర్లన్నీ కట్టిపెట్టి మీ మేనల్లుణ్ణి త్వరగా ఓ యింటివాణ్ణి చేద్దా బాబూ, నీకు పుణ్యముంటుందీ." మా మహాలక్ష్మి ఇంతలా బాధ పడ్డానికి కారణం లేకపోలేదు. ఆ మధ్య ఓసారి కొడుకు పేర ఆవిడ ఉత్తరం రాయించింది, "అంత డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు పెట్టెయ్యకపోతే కొంతలో కొంతయినా వెనకెయ్య రాదట్రా అబ్బాయ్? ఏదో ఎత్తలేని బరువు మోస్తున్నట్టు ఎన్నిసార్లు రాసినా అక్కడ చెప్పలేనన్ని ఖర్చులని రాస్తావు. ఏదీ ఒక నెల పద్దురాసి పంపు చూదాం, ఆ ఖర్చు లేమిటో!" అని.

దీనికి మా సోమనాథం రాసిన జవాబు 'ఒకరి ప్రమేయం లేకుండా ఖర్చు పెట్టుకోడం మరిగిన' బ్రహ్మచారు లంతా తలో కాపీ తీసి దగ్గి రుంచుకోడం మంచిది.

"అమ్మా,

నీ ఉత్తరం అందింది. సరిగ్గా ఎడ్రసు రాస్తే అంద కేం చేస్తుందిలే!

నువ్వు అడిగిన భోగట్టాకు నా సమాధానం విను. ఇక్కడ పని చేస్తున్న మా స్నేహితు లందరిలోనూ నేనే జూనియరు మోస్టుని. అంటే అందరి కంటె తక్కువ జీతగాడిని అయినా అందరూ ఇళ్ళకు రాసి "అయిదేసి వందలు, ఆరేసి వందలు, వెయ్యేసి – వెయ్యేల? వేలకి వేలు అలా తెప్పించుకుంటూనే ఉంటారు. లెక్కా పద్దూ లేకుండా. ఇంటికి రాసి ఏమీ తెప్పించుకో నసీ, పరమలోభి నసీ యిక్కడివాళ్ళు నన్ను అర్థమయిన మాటలూ ఆడుతున్నారు. 'పది పచ్చ నోట్లయినా లేకుండా మీకు నెలా ఎలా గడుస్తోందండీ ఆశ్చర్యం!' అని నన్ను చూసి వేళేసుకోని ముక్కు ఒక్కటయినా లేదు.

సరే – ఇవన్నీ నమ్మక యింకా నువ్వు పద్దురాసి పంపమంటే నాకు అభ్యంతరం ఎంతమాత్రం లేదుగాని ఒక్క షరతు. 'ఇళ్ళద్దెలూ, శిస్తూలూ, కలిసి ఎంత లేదన్నా మా అమ్మగారు నెల కో నాలుగొందలు కళ్ళ చూస్తారు సుమండీ' అని నే నిక్కడి వాళ్ళతో చెబితే 'అ పోనిద్దురూ, మరీ చోద్యం! ఒక్క ఆడకూతురు అంత సొమ్మేం జేసుకుంటుందీ!' అని నన్ను కొట్టిపారేస్తున్నారు. కాబట్టి నువ్వు అక్కడ ఏం చేస్తున్నావో ఒక్క నెల ఖర్చు రాసి పంపితివా, వీళ్ళ నోరు నొక్కినట్టూ ఉంటుంది, నాకు మార్గదర్శకురాలివయినట్టూ ఉంటుంది – మరోలా అనుకోవుగా?–

నీ సు పుత్రుడు,
సోమనాథరావు."

"చూశావా రామం, తల్లి నని ఏమాత్రం ఇది లేక ఏ మాట పడితే ఆ మాట ఎలా రాసేశాడోను! ఐనా ఎక్కడికి పోతాయిలే పోలికలు!"

ఒక నిమషం ఆగి మా మహాలక్ష్మి మళ్ళీ అందుకుంది.

"ఓరోజు కోరోజు, వా దేమైపోతాడో అన్న బెంగ నా కెక్కువైపోతోంది. 'పెళ్ళి మాట ఎత్తేవంటే మళ్ళీ నీ మొహం చూడను' అని ఏళ్ళ కొద్దీ 'మొండి కెత్తిన దాన్ని మొగు డేం జేసు? సిగ్గు లేనిదాన్ని శివు డేం జేసు?' అన్నట్టు కూచున్నవాడు ఏకళ నున్నాడో మొన్న ఈ ప్రాంతాలకి వచ్చినపుడు తనకు తానై ఒప్పుకోడం నీ కళ్ళతో నువ్వే చూశావు. ఆ బుద్ధి మారిపోకుండా అది కాస్తా అయిం దనిపిస్తివా, నా కిక నిశ్చింత నాయనా!"

పెళ్ళిళ్ల విషయంలో ఆడపిల్లను కన్నవారిదే అధిక కష్టం కావొచ్చుగాని, అంత కష్టమూ వారిదే కాదుమరి. తీర్చేవారు ఉన్నప్పుడు గొంతెమ్మకోరికలు కోరడమూ అంత అసందర్భంగా కనిపించదుమరి. గుణవంతుడికంటె ధనవంతుడిమీద పిల్ల నిచ్చుకున్నవాళ్లు మోజు పడుతున్నంతకాలం వరకట్న నిషేధం సుఖస్వప్న సౌధం మాత్రమే అవుతుంది. అందుకనే మా మహాలక్ష్మికి ఏ సంబంధమూ ఒక పట్టాన నచ్చలేదు. పెళ్ళికూతురు ఎలా ఉండా లంటే–

సిరిలా ఉండాలి, చంచలబుద్ధి మాత్రం కూడదు.

చిలకలా ఉండాలి. మన గడప దాటరాదు.

సిసింద్రీ లా ఉండాలి. సబుపైనా ఎదురు చెప్ప కూడదు.

సినిమాతారలా ఉండాలి. నీటుగా ముస్తాబవకూడదు.

చెప్పలేనంత కట్నం తేవాలి. మనింట్లో పుచ్చిన కుక్కలా పడుండాలి.

"వాడు చూస్తే ఎక్కడో కోసెదుదురాన ఉన్నాడు. నేనా యిలాంటి అవస్థలో ఉన్నాను. మవ్వు కూడా ఎప్పటికప్పుడు అంటీ ముట్టనట్టుంటే యిక యిదొక దారిలో పడే అవకాశమంటూ ఉండదు. అటుపైన నీయిష్టం'' అంది చివర మాటగా ఆమె.

"అయితే నన్నేం చెయ్యమంటావ్?" అని నే నడక్కుండానే చెప్పేసింది. ''ఈ మధ్య నేనూ పెద్దమ్మాయీ కలసి శ్రీపాదవారి పిల్లని చూశాం. పెళ్లికూతురి తండ్రి ఎక్కడో కాశీలో ప్లీడరీ వెలిగిస్తున్నాట్ట. ఇలా మన సోము పెళ్లి కున్నాడని తెలిసి_వాళ్ల బంధువులింటికి పెళ్లి కొచ్చినవాళ్లమన్ని ఆహ్వానించి పిల్లని చూపించారు."

''ఎలా ఉందేమిటి?"

''లక్షణంగానే ఉందనుకో _ కాని...''

''ఏం? మనం అడిగిన మేరకు వాళ్లు యివ్వలేరా?"

"ఇస్తారనుకో _ కాని..."

''పిల్ల చదువుకోలేదా?''

''చదువుకుంటూనే ఉంది టనుకో_కాని''

''పని పాటులు రావు కాబోలు''


''వచ్చుననుకో _ కాని,..''

''ఇంకా ఏముందమ్మా కానీ? ఇలాంటి కాన్లు ప్రస్తుతం చెల్లుబడిలో లేవని నీకు తలీదా? అన్నీ బాగున్నప్పుడు యిక అట్టే ఆలశ్యం చేయక ఆ శుభకార్యం కాస్తా వెంటనే కానీ.''

''ఆ మాత్రం సలహా చెప్పేవారు లేరనే నిన్ను పిలిపిస్తా?"

''మరి?''

''విను మరి. వాళ్లు మనకి తెలిసినవాళ్లు కాదు. ఆ కుటుంబం మంచి చెడ్డ లేమిటో_




సంప్రదాయ మేమిటో మనకి కొంచెమైనా తెలీదు. పెళ్ళికూతురి వరసకి పెత్తల్లి అయిన ఆవిడ ఎవరో సాయిబుని తీసుకుని లేచిపోయిందని కూడా ఒక వదంతి. నిజం చెప్పాలంటే అన్ని విధాలా మనకు సరిపోయినట్టున్న ఈ సంబంధాన్ని వదులుకోవా లనీ లేదు, ఇలాంటి కబుర్లు వింటూ చూసిచూసి చేసుకోవా లనీ బుద్ధి పుట్టడంలేదు. ఏం చెయ్యాలో తోచక చస్తున్నా ననుకో.''

"ఇంతకీ పిల్లాడు పిల్లని చూసుకున్నాడా, లేదా?"

''అయ్యో. ఆ సంగతి నీకు చెప్పనేలేదు కాబోలు. చూడ కేం, వాడూ చూశాడు. మరి మాయిద్దరితో పాటు వాడూ వచ్చాడుగా. 'అమ్మకి ప్రాణం మీదకి వచ్చిందని' టెలిగ్రాం తెప్పించుకుని శలవు పెట్టి వచ్చాడుగా."

"వాడికి నచ్చిందా?"

"నచ్చింది కనుకనే కాదటయ్యా యీ మాట లన్నీ జరుగుతా! ఆ ఒక్క సందేహమూ లేకపోతే యీపాటికి యిల్లు కళకళలాడుతూ ఉండదటయ్యా?" నేను అయిదు నిమషాలు ఆగి నెమ్మదిగా స్పష్టంగా ప్రారంభించాను. "చూడక్కయ్యా, నీకంటె చిన్నవాణ్ణయినా సమయం వచ్చింది గనుక నీకే చెప్పవలసి వచ్చింది_మరేం అనుకోకు. మన కోరికలూ, మన సందేహాలూ లోకం మీదవి కావు. ఇలావచ్చినవన్నీ ఏదోవంకపెట్టి తోసేస్తూంటే ఆడపిల్లలందరూ అంబలూ, పురుషులందరూ భీష్ములూ అయిపోరూ? లేదా ఈలోగా నీకు వచ్చిన పీడకలలో లాల్చీ పైజామా ధరించిన పార్శీకన్య ఏవరైనా మా మేనల్లుణ్ణి వల్లో వేసుకోనూవచ్చు..."

"అయితే చూసి చూసి గోతిలో దిగమంటావా?''

''ఆలా ఎవరన్నారు?''

''మరి నువ్వు చెప్పే దేమిటి?"

"లేకపోతే ఇప్పుడొచ్చిన సంబంధానికేమొచ్చింది చెప్పు? అన్ని విధాలా బాగుందని నీ నోటితో నువ్వే అంటున్నావు; పైగా వాడికి నచ్చిందంటున్నావు కూడా. లేనిపోనివి ఎవరో కల్పించి చెప్పేరని మానుకుంటామా?"

"నేను కాదన్నానా రామం? ఆ ఒక్క విషయంలో కూడా అనుమానం లేకపోతే మనసుకి పూర్తిగా సంతుష్టి చిక్కుతుంది గద?"

"సంతుష్టికి అంతంటూ ఏముంది అక్కయ్యా? వాళ్ల సాంప్రదాయం గురించి

కు చెడ్డగా చెప్పినవాళ్లెవరో ఆ సంగతి రుజువు చేస్తే బాగుణ్ణు. ఇంతకీ ఎంచిన కొద్దీ ఎవరిలోనైనా ఉంటాయి లోపాలు... ఇక ఆట్టే పడుగూ పేకా వెయ్యక తాంబూలాలు పుచ్చుకోడం మంచిది."

"ఆ స్తమానూ ఆ ముక్కే చెప్పడం దేనికయ్యా? నీకంటె అంతో ఇంతో పెద్దదాన్ని. నా చాదస్తం నాది. ఎన్నో సంవత్సరాల క్రిందటే మన ఇరుపార్శ్వాలా ఎక్కడా దరిదాపుల్లో లేకుండా ఆ మహాక్షేత్రంలో స్థిరపడిపోయారు వాళ్లు. ఆ కుటుంబం ఏమిటో వాళ్ళ కట్టుబాట్లు ఏమిటో"?

"పోనీ మనకి తెలిసిన అక్కడివాళ్ళకెవరికేనా ఉత్తరం రాస్తే?'

"ఉత్తరాలమీద జరుగుతాయా రామం, ఇలాంటి పనులు?"

"అయితే ఏం చేదా. మంటావ్ ?"

"మనలో ఎవరో ఒకరం బయల్దేరి వెళ్ళి నాలుగు సంగతులూ భోగట్టా చేసుకుని రావాలి."

"ఇక్కడి పనులు మానుకుని, బోలెడు ఖర్చు పెట్టుకుని అంతదూరం ఎవరెళ్ళ రాగలరు అక్కయ్యా?"

"మనం వెళ్ళక్కర్లేదు. రైలే తీసుకెళుతుంది. నువ్వేం బెంగెట్టుకో అక్కర్లేదు. ఖర్చులు నే నిచ్చేస్తాను. మరేం అడ్డు చెప్పక్కర్లేదు. మీ కిప్పుడు కోర్టు శలవలని నాకు తెలుసు!"

మా మహాలక్ష్మి అలా మాటడితే నే నింక చెప్పేది ఏముంటుంది? అదిగాక పెళ్ళిలో ఉత్తుత్తి కాశీకి వెళ్ళరాడం తప్ప ఆ పుణ్య తీర్థం దర్శించిరావాలని నా అంతర్గతంలో ఉండనే ఉంది. వచ్చే అవకాశం పోగొట్టుకునేంత వెర్రివాణ్ణి నేనెందుకు కావాలి?

"మాటాడవేం బాబూ, ఒప్పుకున్నట్టేనా? మరొక రెవర్నో ముస్తాబు చేసి పంపలేక కాదు. నువ్వెడితే నాలుగూ కనుక్కు వస్తావు. ఏమాత్రం మనకు అందుబడిలో ఉన్నా మూఢమి రాకుండా ముహూర్తం పెట్టించేస్తాను. ఏమిటి ఆలోచిస్తున్నావ్? కావలిస్తే ఆ పదిరోజులూ మరదల్ని ఇక్కడ దిగబెట్టి మరీ వెళ్ళు."

నా అంగీకారం విని ఆవిడ బ్రహ్మానంద పడిపోయింది.

"నాకు తెలుసు నువ్వు ఒప్పుకుంటావని- నామీద నీకున్న గురి అలాంటిది. నీమీద నాకున్న నమ్మకం అలాంటిది."

* * *

మా స్నేహితు డొకడు యూనివర్శిటీలో పని చేస్తూంటే అక్కడ దిగాను. ప్లీడరు గారింటికి ఎలా వెళ్ళడమా అన్నది ఒక సమస్య అయిపోయింది. మొదట్లో ఏవరో పైవాడిలా వెడదామా అనుకున్నాను. తరవాత ఆ పద్ధతి ఏమిటో నామటుకు నాకే నచ్చలేదు. ఇవాళ ఈ సంబంధం దాచిపెట్టినా, రేపొద్దున వాళ్ళూ వీళ్లూ బాగానే ఉంటారు - మా మహాలక్ష్మి అక్కయ్యతో సహా అందరూ అక్షింతలు జల్లేది నామీదే. అందుకనే నన్ను నేను దాచుకోలేదు. నేను ఆడిన ఒక అబద్ధమూ ఏమిటంటే కేవలం మొక్కుబడి కోసమే కాశీ వచ్చానని చెప్పడం.

''మే మిక్కడ ఉండగా మీ రిక్కడా అక్కడా దిగడ మేమిటి. అన్యాయం? ఇంక మీరు యూనివర్శిటీకి వెళ్లొద్దు. మా గుమాస్తాను పంపి సామాను తెప్పించేస్తాను. ఎడ్రసు ఇవ్వండి" అన్నారు. ప్లీడరు సదాశివరావుగారు.

''అదెలా కుదురుతుందీ? 'గతికితే అతక' దంటారు. మీకు తెలియ న్దేముందీ" అన్నాను నేను. ఆయన నవ్వేరు.

''మేం అక్కడికి వచ్చినప్పుడు ఆ పట్టింపులు. అదిగాక మనిద్దరికి అన్నదమ్ముల వరస - ఇక అభ్యంతరం చెప్పకండి.''

''పోనిద్దురూ మా చాదస్తం మాది. ఇక్కడున్న వారంరోజులూ ప్రతీరోజూ ఎలాగ విశ్వనాథ దేవాలయానికి వస్తూనే ఉంటాను. వచ్చినప్పుడు మీ యింటికి తప్పకుండా వస్తూంటానుగా!''

''మీ రలా అంటే నే నేం చెప్పను? ఇంతకీ మీలాంటి పెద్దవాళ్ళతో సంబంధం కలవడం మా అదృష్టం. కాశీలోగాని ప్రాణం విడవనని మా నాన్నగారు ఏ ఏభైఏళ్ళ క్రితమో మా కుటుంబాన్ని ఇక్కడికి తరలించేశారుట. అప్పట్నుంచి మనవాళ్ళకీ, మన దేశానికీ దూరమైనా ఏదో ఆ విశ్వనాథుడి చలవ వల్ల మరింత బాగుపడ్డా మనే చెప్పొచ్చు. ఈ శోభని యిప్పు డంతదూరం ఇవ్వాలంటే నా మన సెంత బాధపడుతూందో చెప్పలేను. దూరాభారం మాట దేము డెరుగు. అది యింట్లోంచి వెళ్ళిపోయాక నే నింక యింట్లో నిలబడగలనా అని! ఏం చేస్తాంలెండి, ఏ తండ్రికయినా ఈ బాధ తప్పదు. 'అనుచు కనుగొనల్ అశ్రువుల్ చినుక బలికె జానకమ్మను పంపుచు జనకరాజు' అని ఆ కర్మయోగికే తప్పలేదు ఆ కర్మబంధం! ఇక నాలాంటి సామాన్యు లనగా ఎంత? ఇంతకీ ఇంతదూరాన ఉన్నా మాకు అన్నివిధాలా యోగ్య సంబంధం దొరకడం మా అమ్మాయి పూర్వసుకృతం."

ఇంకా ఆయన అలా ఏదో చెబుతూనే ఉన్నాడు. 'నాన్నా, నాన్నోయ్, నాన్నగారోయ్, అంటూ పొంగే తరంగిణిలా, గెంతే కురంగిణిలా ఓ అమ్మాయి లోపలికి పరిగెత్తుకొచ్చింది. ఆ మహా హడావిడిలో కుర్చీకి సరిపడా గుమ్మటంలా ఎదురుగుండా కూచున్న నా ఉనికిని ఎలా విస్మరించిందో, లేదా తన తండ్రి దగ్గరకి వచ్చే హిందీ క్లయింట్స్‌లో ఒక ళ్ళనుకుందో, ఆ ధోరణీ మాత్రం ఆపలేదు.

"ఇవాళ మా ఫ్రెండ్సందరం అలా బోటుమీద గంగ అవతలొడ్డుకు షికారు వెళ్ళేం నాన్నా — అక్కడ గాలి పడగలు ఎగరేస్తున్నారు. ఎంతెత్తు కెగిరాయో చెప్పలేం. అలా తలకింద చేతు లెట్టుకుని ఆ యిసకలో పడుకుని ఆ గాలిపడగల పందేలు చూస్తూంటే ఎంత సరదాగా ఉందో వర్ణించలేం. అక్కడలా ఉండిపోవాలనిపించింది. అంతకంటె ఏం కావాలని

పించింది. ఆ వేళ్ళప్పుడు నా కెవ్వరూ జ్ఞాపకం రాలేదు. ఆఖరికి నువ్వుకూడా. తెలుసా ? అవును నే నెవరో నాకే స్మృతి లేనప్పుడు, ఎంత యిష్టమైతే మాత్రం ను వ్వెలా గుర్తుంటావ్, అర్థంలేని మాట ?"

"ఇదిగో శోభా, అంతటి రసానుభూతి నీకు కలిగితే ఆనందించవలసిందే గాని ఎదురుగుండా మాత్రం ఎవ రున్నారో చూసుకో."

"అందుకనే మరింత వివరించి చెబుతున్నాను. నాకు కలిగిన ఆనందం ఎదుటి వారికి పంచడం కంటె అతిధి మర్యాద ఏముంది ? ఏమండీ 'ఎదురుగుండా ఉన్న ఎవరో గారూ', ఏమంటారు ?"

"నాకు ఊపిరే సలిపేట్టు లేదు. జవాబు కూడా ఏం చెప్పను ?"

"ఏమిటి శోభా చిన్నా పెద్దా అని లేకుండా మరీ మాటాడుతావు. అవతలివా ళ్ళేమను కుంటారో ఆలోచించుకో కొంచెం ! అయినా ఆయన నోరేనా విప్పలేదుగదా తెలుగు వారని నీ కెలా తెలిసింది ?"


"ఓస్, నోటితో చెబితేగాని యింకేవీ తెలీదు కాబోలు !" అని ఒక్క ముక్కలో తేల్చిపారేసింది శోభ — నా వైపు తిరిగి అంది "ఏమండీ, నా దూకుడికి కోపం రాలేదనీ, పైగా మెచ్చుకుంటున్నారనీ మిల మిల మెరుస్తున్న మీ కళ్లే చెబుతు న్నాయి, కదూ ? వస్తా ఇవాళ రేడియోలో ఏదో మంచి నాటకం ఉంది. అయిపోతే మళ్ళీ రాదుగా ?" ఎలా వచ్చిందో అలా రివ్వుమని వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

"దీన్ని చూసుకునే 'అది' లేదనే బాధ మరచిపోయాను పూర్తిగా. ఇది ఇంట్లోంచి వెళ్ళిపోతే ఎలా నిలదొక్కుకోగలనో ఏమిటో — ఏం చేస్తాం, ఆడపిల్లని కనడం అందమైన కల కనడంలాటింది. ఎప్పుడూ ఎలా ఉంటుంది ?" ఆయన జేబు రుమాలుతో కళ్లద్దుకున్నాడు.

"ఏమైనా అదిపోయాక కొంచెం గారాబం ఎక్కువైం దనుకుంటాను. ఇప్పుడు మా శోభని మీ కళ్ళతో మీరే చూశారు కదా, ఏమంటారు ? మీ కేంతోస్తే అది ఉన్న దున్నట్టు చెప్పెయ్యండి. నే నేం అనుకోను. మరీ చిన్నపిల్లలా ప్రవర్తిస్తోంది కదూ ?"

నేను ఆలోచిస్తున్న విషయం వేరు. మా మహాలక్ష్మి అక్కయ్య తన పెద్ద కూతుర్నీ, మా సోముగాడ్నీ తీసుకుని శోభని చూడ్డాని కెళ్ళినప్పటి దృశ్యం — మా అక్కయ్య చెప్పినది — నా మనస్సు మళ్ళీ నెమరు వేస్తోంది.

"మరీ అంత సిగ్గయితే ఎలాగమ్మా శోభారాణీ ? అయినా ఈ సంగతి ముం దైనా తెలిసింది కాదు - ఈవిణ్ణి ఏ డాబా చివరో పిట్టగోడమీదో కూచోబెడుదుము. మా తమ్ముడేమో కిందనుంచి చూసుకొనే వాడు !" శోభ తలెత్తలేదు.



"ఉన్న మాట మొహంమీద అనెయ్యడం తప్ప ఈ పిల్లకి యింత సిగ్గెప్పుడు వచ్చిందో ఆశ్చర్యంగా ఉంది లక్ష్మివదినా! ఎంత చదువుకున్నా పెళ్ళిచూపులు అనే సరికి చెదిరిపోతుంది కాబోలు ఆడమనసు!"

ఒక పావుగంట సేపు ముళ్ళమీద కూచున్నట్టు కూచుని ఇంట్లోకి పరిగెత్తుకుపోయిందిట శోభారాణి. ఆ అమ్మాయే కాదు, ఎవరైనా అంతే. అప్పుడే కాదు. అలా అలా శతాబ్దాలు గడిచిపోయినా ఆ పద్ధతి అంతే.

మొన్న ఆ మధ్య మా దొడ్డమ్మ కూతుర్ని చూసుకోడానికి ఇలాగే ఎవరో వచ్చారు. తరువాత దాన్ని అడిగాను "ఏమే, వాళ్ళు వచ్చి నిన్ను అవీ యివీ అడుగుతున్నప్పుడు నీ కేమనిపించిందే?" అని.

"నా మనసులో ఉన్నది చెబుతాను. ఏమీ అనుకోనంటే – మరెవరికీ చెప్పనంటే"

"అందుకేగా అడుగుతా? చెప్పు చెప్పు."

"అయితే ఓ షరతు. ఆ పెళ్ళికొడుకు గాడిని నేను వాడు వాడని వ్యవహరిస్తాను. అలాగేనా?"

"మధ్యని నా కేం? నా మేనత్త కొడుకు కాదుగా? అయినా ఒకవేళ నువ్వు వాళ్ళకి నచ్చితే వాడే నీ పాలిట 'గాడు' అంటే దేముడు కాదటే?"

"వాడి మొహం. వాణ్ణి చేసుకుందుకిక్కడ సిద్ధంగా ఎవరున్నారు గనక? వాడు చూసుకున్న సంబంధాలలో ఇది యిరవైఏడోదిట–అదో ఘనత కాబోలు–సిగ్గు లేకపోతే సరి. అమ్మా నాన్నా అక్కడ ఉండిపోయారు కాని లేకపోతే ఆ కొత్తముక్కే అనేద్దును."

"ఏమి టదీ?"

"అవో ఁతాబు టండీ అగ్గి తొక్కిన ఆంజనేయులుగారూ – ఆ మూడు సంబంధాలూ అయిపోయేదాకా ఆగండి. అప్పుడు ఏకంగా బోర్డుచెక్కించుకోవచ్చును 'ముప్పై మంది కన్యలచే తిరస్కరింపబడిన మొనగాడు' అని."

నేను నవ్వు ఆపుకోలేక పోయాను.

"లేకపోతే ఏమిటి చిన్నాన్నా మరీను. ఎంతకాలం వీళ్ళు మమ్మల్ని ఇలా అవమానం చేస్తారు? ఏ తప్పు చెయ్యకపోయినా 'ఇంకా పెళ్ళవలేదే' మని ఇరుగూ పొరుగూ ఆదే మాటలే పడమా? గుండెలమీద కుంపటిలా కన్నవారే భావిస్తే అదే తట్టుకోమా? అప్పుడప్పుడు ఇలాంటి అయోగ్యుల ముందు తలవంచుకు కూచోమా? నువ్వే చెప్పు సున్నిత మనస్కులకందరికీ ఇది సూటి ప్రశ్న. నే నేం చెప్పగలను."

ఈ నాడు శోభను చూస్తూంటే మళ్ళీ అదే ప్రశ్న నన్ను నిలదీసింది. ఏం తప్పు చేశారని వీళ్ళకీ శిక్ష? ఇంతకీ అంత కొద్ది కాలంలో అవతలివాళ్ళు తెలుసుకోగలిగేది ఏ మాత్రం? 'జూ'లో మృగాన్ని చూసి కన్యమృగాన్ని ఊహించడం ఎవరి తరం? ఈ శోభ గురించి వీళ్ళు తెలుసుకున్నది ఎంత తక్కువ!

'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అన్నారు సదాశివరావుగారు.

"అబ్బే ఏంలేదు. ఇక్కడ ఇంకా చూడవలసిన ప్రదేశాలు ఏం మిగిలాయా అని... ఇప్పటికే ఆలశ్య మైపోయింది. మళ్ళీ మావాడు కనిపెట్టుకుంటాడు. ఏ మాత్రం వీలైనా రేపు వస్తాను."

"ఇక్కడ ఉండిపోమంటే ఉండిపోడు గదా – మీ మాట మీదేకదా?"

"నా మాట నాది కాక మీ దెలా అవుతుంది!"

"మొత్తానికి మాటకారులే!"

"మీ అమ్మాయికంటేనా?"

అవును. నిజం చెప్పవలసివస్తే – ఏ విధమైన సాదృశ్యమూ లేకపోయినా నేనూ శోభా అంత తక్కువకాలంలోనే అంత సన్నిహితులం అయిపోడానికి పరస్పరం మాటకారితనాన్ని మన్నించడమే కారణం.

"నీకు మా నాన్నగారు డ్యాన్సు చెప్పించారుట. ఏదీ, రేపొద్దున మా అక్కయ్య అడుగుతే నేనేంచెప్పేది శోభా?"

"అత్తగారి దగ్గిర కోడలు చేసే డ్యాన్సు వేరుగా ఉంటుందని వినిడికి!"

"పోనీ అదైనా సరే... నాకు చూపించకూడదూ?"

"ఇప్పుడా. ఈ వయసులోనా. భలే వారండీ చిన్నాన్నగారూ మీరు."

"ఏం తప్పా? నీ డ్యాన్సు చూస్తేగాని నేను కదిలేది లేదు."

"అలాగే. ఆమాటమీదే ఉండండి. నేను ఈ నాటికి సరిగా నూరోనాడు డ్యాన్సు చేస్తాను. అందాకా మీరు యిక్కణ్ణుంచి కదలకూడదు."

"చమత్కారివే; ఒప్పుకున్నాం గాని, అదేదో నీ డ్యాన్సులో చూపిద్దూ!"

"మళ్ళీ మీరు ఆ మాట ఎత్తేరంటే నూతిలో పడతా."

"అదే నేను కోరేదీను. నువ్వు నూతిలో పడినట్టూ, తాళ్ళూ, నిచ్చెనలూ తీసుకొచ్చి అందరూ నిన్ను రక్షించినట్టూ అంతా కళ్ళకు కట్టినట్టు డ్యాన్సు చేసి చూపించాలన్నమాట – తెలిసిందా?"

శోభ ఫక్కున నవ్వింది.

"మీ మాటకు మరో అప్పుడయితే వెంటనే డ్యాన్సు ప్రారంభించి ఉందును. వెనకటికి ఓసారి రేడియోలో 'రావే నా సఖియా' అనేపాట వచ్చింది. జగత్తునంతా ఉన్మత్తుల్ని చేసిన మురళీరవళి విని ప్రతిఒక్కరూ ఎందుకు పిచ్చెత్తిపోయారో అప్పుడే నాకు అర్థమైంది. నిజంగా ఆ పాట విని, ఆ పిలుపులు విని, రాకుండా ఎవర్తి ఉండగలదు."

ఇరవై యేళ్ళయినా నిండని ఈ అమ్మాయికి ఇంత సున్నిత మనస్తత్వం ఇంతటి సౌందర్యాన్వేషణం ఎలా వచ్చాయి! మర్నాడు మాటల సందర్భంలో సదాశివరావుగారు తనభార్య గురించి చెప్పినప్పుడు గాని దీనికి జవాబు ఎక్కడ దొరుకుతుందో నాకు తెలియలేదు.

ఇక పదిరోజులుగాని తనభార్య బతకదని పెద్దపెద్ద డాక్టర్లు స్పష్టంగా చెప్పినప్పుడు ప్లీడరుగారు ఆమెతో అన్నారుట.

"ఇందూ, అలా చూస్తున్నావేం? నీ మనసులో ఏమైనా కోరిక ఉండిపోయాయా?"

ఇందిర నీరసంగా నవ్వింది. ఆమె కళ్ళు చిన్నగా మెరిశాయి; నెమ్మదిగా అంది.

"నెత్తిమీద పెట్టుకుని పూజించిన భర్త. కాలు కదపకుండా చేసిపెట్టిన అత్త. పనస పండులాంటి పిల్ల. నాకింకేం కావాలి? నాకేం కోరిక ఉంటాయి?"

"దాన్ని అడుగుతావేమిట్రా, జబ్బు మనిషి, అదేం చెప్పగలదూ? విశ్వనాథుడి అభిషేకానికి వెంటనే ఏర్పాట్లు చేయించు - ఇలాంటి పరిస్థితిలో ఆ దేముణ్ణి చూసుకోవాలని ఎవరికుండదు," అంది అత్తగారు.

ఇందిర అయిష్టంగా తల ఊపింది.

"అదేమిటి, దేముణ్ణి చూడనంటావేమిటి- తప్పుమాలిన మాట! కళ్ళు పోగలవు. లెంప లేసుకో" అంది మళ్ళీ అత్తగారు.


ఇందిర మరింత కాంతివంతంగా నవ్వింది.

"దేముడిలాంటి మనుషుల మధ్య ఉన్నప్పుడు వేరే వెళ్ళి దేముణ్ణి చూసేదేమిటి? ఈ ఇంట్లో దేముడు లేని దెప్పుడు!"

భ్రమవల్ల అలా అంటోందో భ్రమ పూర్తిగా పోవడంవల్ల అలా అంటోందో గాని అందరికీ దిగ్భ్రమ కలిగించేయి. ఎవరూ జవాబు చెప్పలేకపోయారు.

నా మంచం కిటికీదగ్గిర వేయించండి. ఆ పెద్దకిటికీ తలుపులు ఎప్పుడూ తీసి ఉంచండి. ఉన్న నాలుగురోజులూ ఆ కిటికీ లోంచి అలా అటువైపు చూస్తూ పడుకుంటాను. నేను కోరేది ఏదైనా మిగులుతే అదే."

లోకాతీతవ్యక్తులు వీళ్ళు. ఊహాతీత శక్తులు వీళ్ళవి. భావాతీత సూక్తులు వీళ్ళవి. ఇందిరమ్మకు తను లేకపోతే ఏమైపోతుందో అన్న విషయంమీద ఐదునిమిషాలపాటైనా ఆసక్తిలేదు. భర్తని మళ్ళీ పెళ్ళి చేసుకోమని చేతిలో చేయి వేయించుకోటం మాట దేవుడెరుగు - ఉన్న కాస్సేపయినా కన్న కూతుర్ని కౌగలించుకుని పడుకోవాలని లేదు!




సదాశివరావుగారు దుఃఖాన్ని బలవంతాన ఆపుకున్నారు. కాస్సేపు ఆగి నేను అడక్కుండానే మొదలెట్టేరు

"ఆ కిటికీ అవతల ఇందుని అంతగా ఆకర్షించింది ఏముందో తెలుసుకోవాలని మీకు అనిపించడం సహజం. మరేం లేదు. అక్కడున్నది పెద్ద బూరుగు చెట్టు!"

"బూరుగు చెట్టా? అందులో ఏముందీ?"

"ఏముంది? ఏం లేదు! మామూలు కళ్ళతో చూస్తే మనకేం కనిపించదు కాని ఆ కళ్ళు వేరు. ఆ చూపులు వేరు ఆ అర్థం చేసుకోవడం వేరు. కొన్ని వందల ఏళ్ళబట్టి మానవమాత్రులు ఆకాశం మీద మేఘాన్ని చూశారు. చూస్తున్నారు. అందరూ చూశారు; కాళిదాసూ చూశాడు. కాని కాళిదాసు తలెత్తి మేఘశకలాన్ని చూసినపుడు ఆయనలో కలిగిన రసావేశం మనమే దాన్ని చూస్తే 'ఎంత బాగున్నావు మేఘమా!' అనుకుంటాం. 'నీచేత చిన్న కబురు పంపించి కథ సృష్టిస్తే అప్పుడెలా ఉంటావు మేఘమా!' అనుకుని ఉండాలి కాళిదాసు. అంత ఘనకావ్యం తయారయింది. విశ్వసాహిత్యంలో మేఘసందేశం మేరు ఔన్నత్యం పొందింది. అందమైన సృష్టి కావాలి ఏమంటారు రామంగారూ?"

"నిజమే ... మీ కుటుంబమంతా కళాకారులు అనుకుంటా."

అబ్బెబ్బే. అదేం లేదండీ...మా కెవరికీ ప్రత్యేకించి ఒక కళలో అంటూ పాండిత్యం లేదు. ఎటొచ్చీ 'ఎప్రిషియేట్' చెయ్యడం తెలుసు అంతవరకు అదృష్టవంతులమే. సందేహం లేదు. ఇంతకీ ఇలాంటి సునిశిత పరిశీలన మాకందరికీ కలిగేలా చేసిన పుణ్యం మా ఇందిరిదే."

"ఇంతకీ ఆ బూరుగు చెట్టు గురించి పూర్తిగా చెప్పేరే కాదు!"

"అదే ఆ విషయానికే వస్తున్నా. 'ప్రకృతిలోని మనోహర ప్రకృతికి మారుపేరు ఈ బూరుగు చెట్టు' అంది ఒకనాడు మా ఇందిర నాతో."

"నీకేం మతి పోయిందా ఏం? ఇంత కన్న చక్కనిచెట్లే నీకు కన్పించలేదూ?"

"లేదు. అందుకనే మతి పోయింది. ఆ మాట నిజమే..."

ఇందిర కాస్సేపు ఆగి నెమ్మదిగా నాతో అంది.

"కిటికీ తెరిచినప్పుడల్లా ఒకసారి ఆ చెట్టుని పరీక్షగా చూస్తూండండి. తరవాత నాతో చెప్పండి."

"రామంగారూ – మా ఇందిర చెప్పినట్టే ఆ తరవాత చూశాను. ఇంతకుముందు ఎన్నో ఏళ్లై ఆ చెట్టు అక్కడే వుంది. అది అంత అందమైన దని అమె చెబితేగాని తెలియలేదు :''

''అదేమిటండీ ఆ చెట్టులో అంత ఆకర్షణ ఉందా ?" అన్నాను ఊరుకోలేక.

''అవును కావలిస్తే ఈ సారి మీరే పరీక్షించి చూడండి. మాటవరసకి ఆ చెట్టుని శిశిరంలో పరీక్షించండి. అంతా గోధుమవర్ణం. ఒక్కటంటే ఒక్క ఆకుకూడా ఉండదు. శిధిలావస్థని తెలియజేస్తూ ఏ చిత్రకారుడో వేసిన తైలవర్ణ చిత్రంలా ఉంటుంది. కాలం నాలుగడుగులు ముందుకి వెయ్యనియ్యండి, గాలి దేవుడికి కాస్త జలుబు చెయ్యనివ్వండి – ఎక్కడ్నుంచి పుట్టుకొస్తాయ్ – ఆ లేతాకు పచ్చ చిగుళ్లు – కొత్తగా ఊసులు నేర్చిన పాప కబుర్లలా ఎక్కడ చూసినా అవే... మరి నాలుగు రోజులాగండి. ఎట్టిటి పువ్వులు – కిక్కిరిసిన వికసించిన కలువలు గల కొలనులా – ఆ పువ్వులు తప్ప మరొకటి మీకు కనబడవు. తెల్లారి లేచేసరికి ఇంత ఎత్తున ఆ రేకులు రాలి ఉంటాయి. ఏ మహా మహుడు ఏదో ఘన కార్యం చేశాడని మరోపని లేనట్టు నూటికో కోటికో దేవతలు పూలవర్షం కురిపించేదేమిటి వెర్రిగాని ! భూదేవి సహనానికి మెచ్చుకుని ఏ పూలచెట్టు ప్రతినిత్యం పూలవాన కురిపించదు ! సరే ఆ చెట్టున ఆ పూలు అలా ఉంటాయనుకున్నారా ? ఓ నెల్లాళ్ళు మనది కాదనుకుని మళ్ళీ తలెత్తి చూడండి. ఏమయ్యాయి ఆ పువ్వులు ? ఎక్కడ చూసినా పూర్తిగా ఆకుపచ్చగా ఉండే రామచిలకలు ! ఆ కాయలుమాత్రం అలా ఉండిపోతాయా ? సూర్యుడుగారి కోపం మరింత ఎక్కువవనియ్యండి. చూస్తూండగా, చెప్పాపెట్టకుండా, నల్లగా మారి ఊరుకుంటాయి. వాటిని ఎవరూ కోసుకోకుండా అలా ఉంచితే కొన్నాళ్ళకి నల్లరాతిలా కనపడే వాటి హృదయాలుకూడా బద్దలై తేలికతనంలోనూ తెలుపులోనూ మబ్బులనికూడా తలపిబ్బు చేసే పట్టుకుచ్చులాంటి దూది బయలుదేరుతుంది. ఎన్ని రంగులు, ఎన్నెన్ని వింతలు !'' ముగ్ధుణ్ణయి మూగబోయి ఆ మాటలు వింటున్నాను.

''సుందరమయమైన దేమిటో చెప్పింది. ఈ యింటికి శోభ నిచ్చింది. తనదారిన తను వెళ్ళిపోయింది. అంతే.''

ఆయనకోసం ఎవరో పార్టీలు వచ్చేరు. ఆవాళ నేను సారనాథ్‌కి ప్రయాణం పెట్టుకోడంచేత అక్కణ్నుంచి త్వరగా కదిలి వచ్చేశాను.

*   •   *

రైలు కదిలింది. తిరుగు ప్రయాణంలో ఉన్నాను నేను. విశ్వనాథుడూ, అన్నపూర్ణా, విశాలాక్షి ఇలాంటివి నాకు జ్ఞాపకం లేవు. సదాశివరావుగారూ, ఇందిరమ్మా, శోభారాణీ వీళ్ళే నామనస్సు నిండిపోయారు. కాశీతాళ్లూ గంగబుడ్లూ నేను తీసికెళ్ళడంలేదు, మనోహరాకృతులూ, మధురానుభూతులూనా కూడా తీసికెడుతున్నాను. నాకు ఇష్టమైన పందో కాయో నేను కాశీలో వదిలి రావడం లేదు, పెళ్ళి కూతురివరసకి పెత్తల్లి అయిన ఆవిడ ఎవడో సాయిబుని తీసుకుని లేచిపోయిం దనే వదంతి గురించి కొంచెమేనా కనుక్కోకుండా ఆ సంగతి అక్కడే వదిలివచ్చేస్తున్నాను !

ఈ అఖరి ఆలోచనకు నేను త్రుళ్ళిపడ్డాను. నేను ఇంత దూరం పనిగట్టుకు వచ్చింది అందుకు కాని అక్కడున్నంత సేపూ మాటమాత్రంగానైనా అది జ్ఞాపకం రాలేదు ! ఎంచేత ? నేను కీటకాన్ని కాదు గనుక. ఆరోగ్యకరమైన శరీరభాగా న్నంతటినీ విడిచి గాయంమీద వాలే రోగజీవిని కాదుగనుక.

అసలు మనుషులు ఇంత అందంగా ఆరోగ్యకరంగా జీవించ గలరనే అంచనాలే నాకు లేదు. నాకు తెలిసిన కొద్ది కుటుంబాలూ ఏదో విధమైన అశాంతితో బాధపడుతూ కనబడే లోకానికి కనిపించని పైవాన్ని దూషిస్తూ బతుకుతున్నారు. ఎప్పుడెవరు కవిపించినా, ఎక్కడెవర్ని కదిలించినా 'ఎందుకూ పనికిరాని కొందరు వెధవలు అదేపనిగా పైకి రావడం, తమవంటి బుద్ధిమంతులు అన్యాయంగా అడుగున పడిపోవడం' ఇలాంటి విషయాల గురించే చెబుతారు. తమ్మెవరూ గుర్తించ లేదనే వారి బాధ. లోకానికి అంతకంటె ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయని వాళ్ళకు తట్టదు.

మా మహాలక్ష్మి అక్కయ్యనే తీసుకుందాం. భరించలేని బాధ్యత లేవీ ఆమెకు లేవు. ఉన్న ఒక్క కొడుకూ అర్జన పరుడై వందలకి వందలు సంపాదించుకుంటున్నాడు. నలుగురు కుర్రాళ్ళని కన్న తరువాత ఉద్యోగం కోసం వెతికే దురవస్థ పోయి పెళ్ళి కాకుండానే తన కొడుకు నాలుగురాళ్ళు సంపాదిస్తున్నా డని తృప్తి లేదు. అందువల్ల కలిగే శాంతి ఆమెకు లేదు. ఎండాకాలం మిట్ట మధ్యాన్నపు వేళ చక్కగా మబ్బువేస్తే దాన్ని చూసి ఏ ఒక్కరోగాని మురిసిపోరు. 'వేళగాని వేళ వేసిందేమబ్బు? అయితే ఇంకో గంటకి ఎండ పేల్చేసిందన్న మాటే' అనుకుంటారు. సరిగ్గా అలాంటి వాళ్ళలోనే చేరుతుంది మా అక్కయ్య. కాబోయే కోడలు తొంభై తొమ్మిది సుగుణాలకీ ఆమె ప్రాధాన్యం ఇవ్వలేదు. ఎవరో కిట్టనివాళ్ళు చెప్పిన పనికిమాలిన విషయంమీదే ఆమె దృష్టి అంతా కేంద్రీకరించింది. ఇలాంటి వాళ్ళని ఏమనాలి ? ఇలాంటి వాళ్ళతో ఎవరు వేగగలరు.

''కాస్త నాలుగూ విచారించి, ఆ అమ్మాయి మనలో ఇముడుతుందో లేదో, మనవాడికి తగునో లేదో కనుక్కురా రామం !'' అంది అక్కయ్య.

న్యాయస్థానాలలోనూ ధర్మపీఠాల్లోనూ ఎంతవరకు సత్యం జయిస్తోందో నాకు తెలిసిన నీతి ఒకటే. నీరు ఎప్పుడూ ఎత్తునుంచి పల్లానికే ప్రవహిస్తుంది. ప్రపంచ

మంతా 'ఒన్ వే ట్రాఫిక్'లోనే నడుస్తోంది. అదేమని అడిగినవాడు విప్లవవాది. 'ఇదిగో యిది మంచి మార్గమేమో చూడండి' అని చెప్పినవాడు నాస్తికుడు.

'మనవాడు ఈ అమ్మాయికి తగునో లేదో కనుక్కోరా' అని ఎవర్తీ అనదు. కాని నేను కనుక్కొన్నది అదే. మా సోమనాథరావు శోభారాణికి ఎంతమాత్రం తగడు. అర్థం అంటే ఏమిటో వాడికి తెలీదు. అందమైనది ఏదో వాడికి బోధపడదు. డిటెక్టివ్ నవల్సు చదవడం, సిగరెట్లు కాల్చడం, క్రికెట్ స్కోరు పెట్టుకు వినడం – ఇంతకుమించి ప్రపంచం ఉందనిచెప్పినా వాడికి బోధ పడదు. తల్లినోటికి భయపడి ఉన్నఊళ్ళోనే హాస్టలులో చేరి యాంత్రికంగా పుస్తకాలు బట్టీపట్టి పరీక్షలు ప్యాసయిన ప్రబుద్ధుడు వాడు. 'వండిపెట్టడానికి కాకపోతే, పిల్లల్ని కనడానికికాకపోతే పెళ్ళా మెందుకు, మేత దండుగ' అని వాడి సిద్ధాంతం. కళాత్మక హృదయాన్ని వాడు ఊహించ లేడు; వహించలేదు కూడా. మరి తెలిసి తెలిసి శోభ గొంతుక ఎలా కొయ్యను ?

సదాశివరావుగారు స్టేషను కొచ్చి చెప్పిన మాటలు చెవిలో గింగురుమంటున్నాయి.

'చూడండి. మీ అక్కగారితో చెప్పండి. నాకా ఒక్కగానొక్క పిల్ల. కట్నమే కాకుండా, నాకు ఏమి మిగిలినా అది మా శోభదే. పురిటికీ పుణ్యానికీ ఎవరూ ఆడ తోడు లేరని విచారించ వద్దు. మా అమ్మ ఉంది. అంతగా అవసరమైతే మా పెద్ద క్కని పిలిపిస్తాను. ముహూర్తం పెట్టించి రాయించండి.'

నా నిశ్చయమేదో దారిలోనే చేసుకున్నాను. ఇంటి కెళ్ళగానే చెప్పేను. ''అలా ఉన్నావుగాని నీ కెన్ని తెలుసు అక్కయ్యా! ఇంకా నయం, నా మాట విని తొందరపడ్డావు కావు. నువ్వు విన్న వదంతి నిజమే. అంతే కాదు ఆ పాయిబుకొడుకు యిప్పుడు వీళ్ళింట్లోనే ఉన్నాడు. అందరూ ఏకపంక్తిని కూచుని భోజనాలుకూడా చేస్తారు. అదెంత తెగించేశారో! ఇక ఆ శోభకి పంజాబీడ్రెస్ తప్ప మరొకటి కిట్టదుకదా!" మా మహలక్ష్మి అక్కయ్య దవడలు నొక్కుకుంది.

పోనీలే బాబూ...ఇంక ఆ సిగ్గులేనివాళ్ళ కబుర్లు నాకు చెప్పకు. ఏ జాతకాలో పడలేదని నీ చేత్తో నువ్వే రాసిపడెయ్యి. నేను ముందే చెప్పలేదూ, నువ్వెడితేనేతప్ప ఇంతగా వివరాలు తెలియవనీ......నీకు శ్రమ ఇచ్చాను మరోలా అనుకోకు రామం. నీ ఉపకారం మరచిపోనులే!" నేను వెంటనే జాతకాలు పడలేదని ఈయనకి రాసేశాను.

వెయ్యి అబద్ధాలాడి ఒక్కపెళ్ళి చెయ్యమన్నారు. ఒక్క అబద్ధం ఆడి పెళ్ళి ఆపి వెయ్యి అని ఎవరూ అనలేదు. కాని నేను చేసింది అదే. శోభారాణి కిక పెళ్ళికా దని ఎవరూ మథపడనక్కరలేదు. ఆమె మా పెద్దమ్మాయిలాంటిది. ఆ బాధ్యత నాది. మీ ఎరికిన ఆమెకు తగినవరుడు ఎవరైనా ఉన్నట్టు తోస్తే నాకు రాయడంమాత్రం మరచి పోకండి.

